సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 4 । జూలై । 2023



వర్షంతో ఉపశమనం ‖లో

జిల్లాలో కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం సాగుకు ఎంతో ఉపయోగమని రైతులు తెలిపారు.



ఆస్పత్రికి ఎన్నారైల వితరణ

చింతూరు ఏరియా ఆస్పత్రికి ఎన్నారైలు బెడ్‌షీట్లు, పిల్లో కవర్లు వితరణగా చేశారు. ‖లో

ఘనంగా గురుపౌర్ణమి



సాక్షి,పాడేరు: గురుపౌర్ణమి సందర్భంగా నుండ్రుపుట్టు సాయినాథుని మందిరంలో సహస్ర దీపార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నుండ్రుపుట్టు,సేరిబయలులో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

న్యూస్‌రీల్

ఆదర్శంగా సుజనపేట వలంటీర్ సేవలు

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో రోగికి పింఛను అందజేత



పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాలతికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

ముంచంగిపుట్టు: పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని సుజనపేటకు చెందిన లిమిక్య మాలతికి గ్రామ వలంటీర్ వంతాల జానకమ్మ సోమవారం పింఛను అందజేసింది. అనారోగ్యానికి గురైన మాలతి మూడు రోజుల నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సుమారు 52 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి ఆమె పింఛను పంపిణీ చేసింది. ఆమె సేవలను సర్పంచ్ వెంగడ రమేష్, ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి తదితరులు అభినందించారు.

డయాలసిస్ రోగులకు పింఛను అందజేత



పింఛను అందిస్తున్న ఎంపీటీసీ అంజలి

ఎటపాక: మండలంలోని నెల్లిపాకలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న ఇద్దరికి ఎంపీటీసీ బూరం అంజలి చేతుల మీదుగా సోమవారం పింఛను అందజేశారు. ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రభు త్వం మంజూరు చేసిన పింఛనును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ మండలంలోని ప్రతీ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు




పట్టుబడిన గంజాయి, నిందితులు

కొయ్యూరు: చింతపల్లి మండలం నుంచి పెదవలస, బూదరాళ్ల మీదుగా యర్రవరం నుంచి మైదాన ప్రాంతానికి పది కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్ఐ రాజారావు తెలిపారు. ముందస్తు సమా చారం మేరకు దొడ్డవరం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమండ్రికి చెందిన షేక్ రిజ్వాన్, చింతపల్లి మండలానికి చెందిన కొర్రా మోహన్ పది కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. వారి నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని ఎస్ఐ తెలిపారు.

ఆపరేటర్లు, హెల్పర్ల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం : రంపచోడవరం ఐటీడీఏ పరిధి అడ్డతీగల మండలం పింజరికొండ జలవిద్యుత్ ప్రాజెక్టులో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఆపరేటర్ల, హెల్పర్ల పోస్టులకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు https://itdarampachodavaram.ap.govt.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల మూడవ తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రుక్మిణి



చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రుక్మిణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ కీర్తి విశాఖపట్నం కేజీహెచ్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీపై వెళ్లారు.



వంజంగి కొండలను తాకిన మంచు అందాలు

అబ్బుర పరిచేలా..

పర్యాటక ప్రాంతంగా విశ్వవ్యాప్తి పొందిన పాడేరు మండలంలోని వంజంగి కొండల్లో సోమవారం ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. వేకువజామున మేఘాలు, మంచుతెరలు కొండలను తాకగా, సూర్యోదయం కూడా అబ్బురపరిచింది. ఈ దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.
- సాక్షి, పాడేరు



వంజంగి కొండపై కనువిందు చేస్తున్న సూర్యోదయం

నమో..నారసింహా..



గిరిప్రదక్షిణ చేసి సింహాచలంలోని తొలిపావంచాకు వస్తున్న భక్తులు

- అల..సింహగిరి దారుల్లో...
- ముగిసిన గిరిప్రదక్షిణ
- తరలివచ్చిన లక్షలాది భక్తజనం
- అన్ని క్యూలైన్లలో ఉచిత దర్శనం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ ఆదివారం లక్షలాది మంది భక్తులు చేపట్టిన సింహగిరి ప్రదక్షిణ సోమవారంతో ముగిసింది. సింహాచలంలోని తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. స్వామి సన్నిధిలో కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ముగించారు. పలువురు భక్తులు స్వామి దర్శనానికి సింహగిరికి తరలివెళ్లారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు కల్పించారు. భక్తు లు ఇబ్బంది పడకుండా దేవస్థానం అధికారులు రూ.100, రూ.300 దర్శన క్యూల్లో కూడా ఉచితంగా నే పంపించడం విశేషం. భక్తులందరికీ ఆలయ నీలాద్రిగుమ్మం నుంచే లఘు దర్శనాన్ని అందజేశారు. మధ్యాహ్నం సుమారు 12గంటల్లోపే దాదాపు భక్తు లందరూ స్వామివారి దర్శనాలు పూర్తి చేసుకున్నారు.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సోమవారం తెల్లవారుజామున 3గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు. అప్పటికే సింహగిరికి చేరుకున్న భక్తులు ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సైడ్‌లైట్స్

- పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. ఒక పక్క గిరి ప్రదక్షిణ పూర్తి చేసేందుకు సింహాచలం వచ్చే భక్తులు, మరో పక్క గిరిప్రదక్షిణ పూర్తి చేసుకుని తమ ఇళ్లకు చేరుకునే భక్తులతో రద్దీ నెలకుంది.
- గిరిప్రదక్షిణ ముగించి తిరిగి కొబ్బరికాయలు కొట్టే భక్తులతో తొలిపావంచా కిటకిటలాడింది.



దర్శనానికి వెళ్లే భక్తులతో కిక్కిరిసిన మెట్లమార్గం

- మెట్లమార్గంలో కొండపైకి వెళ్లే భక్తులను మాత్రమే అనుమతించారు..
- కొండదిగువకు భక్తులను చేరవేసేందుకు 35 ఉచిత బస్సులను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఉచిత బస్సుల వద్ద రద్దీ ఏర్పడకుండా భక్తులను దఫదఫాలుగా పోలీసులు పంపించారు.
- 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి సింహగిరికి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తరరాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి, బయటకు వచ్చే భక్తులకు దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి పంపించారు.
- ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నాలుగు లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.




భక్తులకు ప్రసాదం పంపిణీ

అవాస్తవాలు...కట్టు కథనాలు



కటికి ప్రాంతానికి రూ.7 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన పక్కా రోడ్డు

- జలపాతాల వద్ద వసతులపై ఈనాడు అసత్య వార్తలు
- పర్యాటకాభివృద్ధిపై విషం చిమ్మే రాతలు
- అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



కొత్తపల్లి జలపాతం వద్ద సమీక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో జలపాతాలను ఎకో టూరిజంలో భాగంగా అటవీశాఖ, ఐటీడీఏ ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి చేస్తున్నాయి. కలెక్టర్ సుమిత్ కుమార్ గతనెల 16న కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించి సమస్యలను గుర్తించారు. రానున్న పర్యాటక సీజన్‌లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించడమే కాకుండా వసతుల కల్పనపై ఆయన దృష్టి సారించారు.

దుష్ప్రచారమిలా..

కొత్తపల్లి జలపాతాన్ని గత 16న సందర్శించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇప్పటివరకు ఎటువంటి సమస్యలు పరిష్కరించలేదని ఈనాడు ప్రచురించింది. కనీసం చిన్న చిన్న పనులను కూడా పట్టించుకోలేదని విమర్శ చేసింది.

వాస్తవమిదీ..

కొత్తపల్లి జలపాతం వద్ద సమస్యలు పరిష్కారంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం పాడేరు ఈఈ డీవీఆర్ఎం రాజుసౌకర్యాల కల్పనకు అంచనాలు రూపొందించారు.

- కొత్తపల్లి జలపాతం ప్రవేశద్వారం అభివృద్ధితో పాటు అదనంగా మరుగుదొడ్లు, మహిళలకు ప్రత్యేకంగా డ్రెస్సింగ్ రూమ్‌లు, పగోడాలు, కూర్చునేందుకు సిమెంటు బెంచీల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇదే ప్రాంతంలో దిగువన ఉన్న మరో జలపాతానికి పర్యాటకులు చేరుకునే విధంగా మెట్ల నిర్మాణం, గతంలోని మెట్లకు మరమ్మతులకు రూ.35 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేలా అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు.

కటికి జలపాతంపైనా అదే ధోరణి

బొర్రా గుహలకు సమీపంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రమైన కటికి జలపాతానికి వెళ్లేందుకు సరియైన రవాణా మార్గం లేనందున సందర్శకులు అష్ట కష్టాలు పడుతున్నారని, ఈ కారణంగా వెనుదిరుగుతున్నారని ఈనాడు కథనం ప్రచురించింది.

వాస్తవమిది..

రాష్ట్ర ప్రభుత్వం అరకు, సుంకరమెట్ట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కటిక జలపాతం సమీపం వరకు రూ. ఏడు కోట్లతో రహదారి నిర్మించింది. అక్కడినుంచి కటికి జలపాతానికి అర కిలోమీటరు దూరం మాత్రమే కొండబాటలో వెళ్లాలి. అయితే కటికి జలపాతాన్ని ఆనుకొని రైల్వేలైన్‌తో పాటు రిజర్వ్‌ఫారెస్టు ఉన్నందున ఇక్కడ మెట్ల మార్గం అభివృద్ధి, ఇతర సౌకర్యాలకు వాటినుంచి అనుమతి రావాల్సి ఉంది. ఇదే జలపాతానికి బొర్రా నుంచి రోడ్డు మార్గం ఉంది. స్థానిక యువకుల ఆధ్వర్యంలో పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సహకారం అందిస్తున్నారు.

తాడిగుడపైనా దుష్ప్రచారం

కటికి జలపాతం మాదిరిగానే అనంతగిరికి మూడు కిలోమీటర్ల దూరంలోని తాడిగుడ జలపాతం వద్ద కూడా పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో లేవని వాస్తవాలకు విరుద్ధంగా ఈనాడు కథనంలో పేర్కొంది.

వాస్తవమిది

తాడిగుడ జలపాతం వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇందుకుగాను పాడేరు ఐటీడీఏ రూ.35 లక్షలు వెచ్చించింది. ఈ పర్యాటక ప్రాంతం నిర్వహణ బాధ్యతను స్థానిక గిరిజనులకే అప్పగించింది. పర్యాటకుల వాహనాలు సాఫీగా వెళ్లే విధంగా ఇటీవల పలుచోట్ల సీసీరోడ్లను కూడా నిర్మించారు. వ్యూపాయింట్, మెట్లు, రెయిలింగ్, దుస్తులు మార్చుకునే గదులు, రెస్టారెంట్లు అందుబాటులో ఉన్నాయి.

జగనన్న సురక్షకు విశేష స్పందన

- రెండో రోజు 6,592 ధ్రువపత్రాల పంపిణీ
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని 11మండలాల పరిధిలోని 21 సచివాలయాల్లో సోమవారం రెండవ రోజు జరిగిన జగనన్న సురక్ష పథకం విజయవంతమైందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అయా మండలాల పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించారన్నారు. వలంటీర్ల యాప్‌లో వివిధ ధ్రువపత్రాల కోసం 21సచివాలయాల పరిధిలో 16,785 వినతులు రాగా, 14,164 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. వీటిలో 6,592 ధ్రువపత్రాలను జగనన్న సురక్ష శిబిరాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేయగా, 47దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. మిగిలిన 7,525 ధ్రువపత్రాలను కూడా పంపిణీ చేస్తామన్నారు. నెట్ సౌకర్యం ఉన్న శిబిరాలలో రిజిస్ట్రేషన్, పరిశీలన, ధ్రువపత్రాల పంపిణీకి మూడు కౌంటర్లు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఐటీడీఏలో నేటి స్పందన రద్దు

చింతూరు: స్థానిక ఐటీడీఏలో బుధవారం జరగాల్సిన స్పందన కార్యక్రమం రద్దయింది. అనివార్య కారణాల వల్ల స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని నాలుగు మండలాల ప్రజలు గమనించాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు.

ఏకలవ్యలో సీట్ల భర్తీకి చర్యలు

చింతూరు: స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపట్టినట్లు చింతూరు ఐటీడీఏ పీవో సూరజ ధనుంజయ్ గనోరే తెలిపారు. ఆరో తరగతిలో బాలురకు ఏడు సీట్లు, బాలికలకు ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఎస్టీ విద్యార్థులు గతంలో జరిగిన ఎంట్రన్స్ పరీక్షలకు హాజరై సీటు రానివారు నేరుగా తగిన ధ్రువపత్రాలతో బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక గురుకుల పాఠశాలలో జరిగే ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని ఆయన సూచించారు.

స్పందనలో 41 వినతుల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 41 వినతులను ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీవో శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో వినతుల వివరాలను తెలిపారు.

- మారేడుమిల్లి మండలం బోదులూరు పీహెచ్‌సీలో ప్రత్యేకంగా బర్త్ వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, పుల్లంగిలో ఎల్ఎల్‌హెచ్‌పీ ఏర్పాటు చేయాలని గుడిసె గ్రామంలో పాఠశాల భవనం ఉపాధ్యాయులు నియమించాలని పుల్లంగి సర్పంచ్ వి.జార్జ్‌బాబు వినతిపత్రం అందజేశారు.
- దేవీపట్నం మండలం పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన రావిలంకలో 18ఏళ్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయడమే కాకుండా పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురికాని భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎం.బంగారు బాబు, గ్రామస్తులు దరఖాస్తు చేశారు.
- అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామంలో భూ సమస్య పరిష్కరించాలని వసంతమణి దరఖాస్తు అందజేశారు.
- వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని గుర్తేడు గ్రామంలో ఇంటి స్థల సమస్య పరిష్కరించాలని సుంకరి నారాయణరావు దరఖాస్తు అందజేశారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డేవిడ్ రాజు, యూసఫ్, నాగేశ్వరరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో డా.అనూష, పిహెచ్‌ఓ చిట్టిబాబు, డా. ఇందిర, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో కేంద్ర ఉన్నతాధికారి పర్యటన



పీవీటీజీ గ్రామాల్లో పర్యటిస్తున్న కేంద్ర గిరిజన వ్యవహారాల డిప్యూటీ కార్యదర్శి రాజీ, ఇతర అధికారులు

అనంతగిరి: మండలంలోని గురుగుబిల్లి పంచాయతీ పందిరిమామిడి, ఊటగెడ్డ, లువ్వా, కొత్తవలస పీవీటీజీ గ్రామాల్లో సోమవారం కేంద్ర గిరిజన వ్యవహారాల డిప్యూటీ కార్యదర్శి రాజీ పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పీవీటీజీలకు అందు తున్న పథకాలు, సదుపాయాలపై గిరిజనులను నేరు గా కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి జీవన విధానం తదితర వాటిపై తెలుసుకున్నారు. పీవీటీజీ గ్రామాల్లో సమస్యలపై తెలుసుకుని, సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పీవీటీజీ మిషన్ ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వలసలను అరికట్టే లా గిరిజనులను ఉపాధి కల్పించాలని, వంద రోజు ల నుంచి 150 రోజుల ఉపాధి పనిదినాలను కల్పించాలని ఎంపీపీ శెట్టి నీలవేణి డిప్యూటీ కార్యదర్శిని కోరారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, సీసీరోడ్ల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ రాంబాయి, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, డీఈఈ జయరాం, ఏఈలు గణేష్, సాయి, విజయ్, ఏపీవో అర్జున్, కోఆప్షన్ సభ్యుడు మదీనా పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతూరు: మాతా, శిశు మరణాల నివారణకు క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐసీడీఎస్, వైద్యశాఖలతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులను త్వరగా గుర్తించి ఆర్సీహెచ్ పోర్టల్‌లోదు నమోదు చేయాలని, అనంతరం వారికి పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనత నివారణకు ఐఎఫ్ఏ మాత్రలను సకాలంలో అందించాలని, శిశు మరణాలు సంభవించకుండా ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. చిన్నారులకు ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. ప్రసవానంతరం క్షేత్రస్థాయి సిబ్బంది బాలింతలను సందర్శించి శిశువులకు ఏమైనా అనారోగ్య సమస్యలుంటే గుర్తించి వెంటనే చికిత్స అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గర్భిణికి ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డు ఉండేలా చూడాలని, ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామాల్లో అందించే వైద్యసేవల గురించి ప్రతి కుటుంబానికి తెలిసేలా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రసవానికి ఏ వైద్యశాలకు తరలించాలో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆస్పత్రుల్లో ప్రసవానంతరం గర్భిణులకు జననీ సురక్ష యోజన పథకం ద్వారా అందాల్సిన ధ్రువపత్రాలను అధికారులతో మాట్లాడి సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం పీహెచ్‌సీల వారీగా వ్యాధి నిరోధక టీకాల కార్యాచరణ ప్రణాళిక ఫ్లెక్సీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, నాలుగు మండలాల పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి స్మారక చిహ్నాన్ని పరిరక్షించాలి



అల్లూరి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వీరభద్రరావు తదితరులు

రాజవొమ్మంగి: వందేళ్ల క్రితం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దాడి జరిపిన రాజవొమ్మంగి పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని మరింత మెరుగుపరచి పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కోరారు. సోమవారం ఆయన రాజవొమ్మంగి పాత పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌కు చరిత్రలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఈ భవనాన్ని సందర్శకులకోసం తీర్చిదిద్దాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అడిషినల్ ఎస్ఐ వి. జాన్‌కుమార్, సంఘం సభ్యులు సోమిరెడ్డి రాజు, శ్యామలవరలక్ష్మి, బాబ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి వినతి

కొయ్యూరు: అల్లూరి నడయాడిన ప్రాంతాలను అన్ని విధాల అభివృద్ధి చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావుకోరారు. అల్లూరి శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా రాజేంద్రపాలెం అల్లూరి స్మారక మందిరంలో సోమవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ మంప, రాజేంద్రపాలెం స్మారక ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఆయన మొక్కలు నాటారు. అల్లూరి యువజన సంఘానికి చెందిన శ్యామల వరలక్ష్మి, ఎం బూర్గులయ్య, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ పీటా సింహాచలం, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. ఆందోళనలో వాహనచోదకులు

- వారం రోజుల వ్యవధిలో నాలుగు ద్విచక్ర వాహనాల అపహరణ



అపరాడలో చోరీకి గురైన బైక్(ఫైల్)



ముంచంగిపుట్టులో రాత్రి పూట తనిఖీ చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. ఇంటి ముందు ఉంచిన బైకులు ఉదయం అయ్యే సరికి కనిపించకుండా పోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గత శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఒక ఉపాధ్యాయుడు తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఉంచగా దానిని ఎంతో చాకచక్యంగా చోరీ చేశారు.శనివారం రాత్రి మండలంలో గల వనుగుమ్మ పంచా యితీ అసరాడ గ్రామానికి చెందిన గంగాధర్ తన ద్విచక్ర వాహనాన్ని రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసి, ఉదయం లేచి చూసే సరికి అపహరణకు గురైంది. కుమడ పంచాయతీ కేంద్రంలో ఒకటి, పనసపుట్టు పంచాయతీ కేంద్రంలో ఒకటి చొప్పున గత వారం రోజుల వ్యవధిలో నాలుగు ద్విచక్ర వాహనా లు చోరీకి గురయ్యాయి. బైకుల చోరీలపై వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గతేడాది సైతం ఒడిశా రాష్ట్రానికి చెందిన ద్విచక్ర వాహన దొంగల ముఠా ముంచంగిపుట్టు మండలంలో 12 ద్విచక్ర వాహనాలు చోరీకి గురి కావడం, పోలీసులు ప్రత్యేక నిఘాను ఉంచి వారిని పట్టుకోవడం జరిగింది. మరలా ఇదే తరహాలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురి అవుతుండడంతో వాహనదారులు అందోళన చెందుతున్నారు. పోలీసులు బైకు దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ కె.రవీంద్ర మాట్లాడుతూ నాలుగు ద్విచక్ర వాహనాల చోరీపై బాధితులు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో బైక్ దొంగలను పట్టుకుంటామని చెప్పారు.

జగనన్న సురక్షతో ప్రజా సమస్యలకు చెక్



పాడేరులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ప్రత్యేకాధికారి కొండలరావు



సంతారిలో లబ్ధిదారుడికి ధ్రువపత్రాలు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అధికారులు, నేతలు

పాడేరు రూరల్ : గడప వద్దకే అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు-1, పాడేరు-3 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టారన్నారు. ధ్రువీకరణ పత్రాల జారీలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి పొరపాటులకు తావులేకుండా లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మండల ప్రత్యేకాధికారి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, ఏఎంసీ చైర్మన్ కె.సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పలాసి కోటేశ్వరరావు, తహసీల్దార్ త్రినాథ్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని పెదలోచలి, వంతాల గ్రామ సచివాలయాల్లో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. పలువురు లబ్ధిదారులకు ఆమె ధ్రువపత్రాలను అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్టీ సెల్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ప్రత్యేకాధికారి, డీపీఆర్‌వో గోవిందరాజులు, తహసీల్దార్ కె.అప్పలస్వామి, పీఆర్ ఏఈ మాణిక్యం, జగనన్న సురక్ష మండల కన్వీనర్ ఎల్.కళ్యాణం, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్ ఐసరం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. పెదలోచలిలో 336 మందికి వివిధ ధ్రువపత్రాలను ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అందజేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, సర్పంచ్ చినకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల సత్వర పరిష్కారం

హుకుంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు సత్వర పరిష్కారమవుతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సంతారి, భీమవరం పంచాయతీల్లో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ కార్యక్రమం ద్వారా11 రకాలైన సేవలు పొందవచ్చని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామవలంటీర్లు ధ్రువపత్రాలను సక్రమంగా మంజూరు చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, డీటీ రంగారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ రమేష్, సర్పంచ్ అప్పలనాయుడు, సింహాచలం, కాకరి బొంజుబాబు,ఎంపీటీసీలు సుశీల, రజని, ఎంఎల్‌వో శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైల్వే ట్రాక్ వద్ద పడి ఉన్న మృతదేహం

అరకులోయ రూరల్ : స్థానిక గిరిజన కాటేజ్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని జీఆర్‌పి ఎస్ఐ వర్మ తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఆయన సోమవారం రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 25 ఏళ్లు ఉంటుందని, సంఘటన ఆదివారం రాత్రి జరిగి ఉంటుందని, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్ర పరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐలు మోహన్, మూర్తి పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల సోమవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రమైన పాడేరులో సాయంత్రం 6గంటల నుంచి భారీ వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఈవర్షాలు ఎంతో అనుకూలమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు తెలిపారు.

రాజవొమ్మంగి: వేసవతాపంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మండల ప్రజలు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. వరి నారు మడుల తయారీ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

జి.మాడుగుల: మండలంలో భారీ వర్షం కురిసింది. పొలాలు, వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. వంతాల, పెదలోచలి, జి.మాడుగుల, సింగర్భ, సోలభం, గడుతూరు పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాడేరు-జి.మాడుగుల, చింతపల్లి, వంతాల,పెదలోచలి,సొలభం, సుర్మతి, వంజరి రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వంతాలలో జగనన్న సురక్ష కార్యక్రమానికి వర్షం వల్ల ఆటంకం కలిగింది. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి టెంట్‌లోనే లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

వర్షంతో చల్లబడిన వాతావరణం

కొయ్యూరు: రెండు రోజుల నుంచి ఎండ తీవ్రత కాస్త తగ్గింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపం చూపినా ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మేఘాలు కమ్మి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రైతులు నారుమడులు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వర్షంతోపాటు గాలులు వీచడంతో మూడు గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాలలో భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, పాఠశాలల్లో అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పి.యర్రగొండ గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో రూ.50లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీతో పాటు అమ్మఒడి, విద్యా దీవెన తదితర పథకాలు అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉన్నత విద్య అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల రాజేశ్వరి, మండల పార్టీ కన్వీనర్ మామిడి అప్పారావు, నాయకులు త్రిమూర్తులు, కనకరాజు, నూకరాజు, తమ్మిరెడ్డి, నారాయణరావు, తిరుపతి రెడ్డి, భారతిబాబు, రమేష్, ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

మండలంలోని పి.యర్రగొండ గ్రామంలో సుమారు రూ.10 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం శివారు గ్రామాల్లో కూడా రహదారులు నిర్మిస్తోందన్నారు. దీంతో గ్రామీణ రహదారులకు మహర్దశ చేకూరిందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం

- 71మంది విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఇతర అధికారులు

సాక్షి, పాడేరు: విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. యంగ్ ప్రొఫెషనల్స్, నేషనల్ కెరీర్ సర్వీసెస్, మినిస్ట్రీ ఆఫ్ లేబర్, ఎంప్లాయ్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు యూత్‌ఫర్ జాబ్స్ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాకు జిల్లా పరిధిలో 97 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ ఇతర అధికారులంతా ఆయా అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు జరిపారు. వీరిలో 42 మందిని నైపుణ్యాభివృద్ధి నిమిత్తం విశాఖపట్నంలోని యూత్ ఫర్ జాబ్స్ సంస్థకు ఎంపిక చేశారు. అక్కడ అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతితో కూడిన సౌకర్యాలను అందించనున్నారు.ఏడుగురికి స్లిప్‌కార్డు, మరో ఏడుగురికి నవతా ట్రాన్స్‌పోర్ట్, పది మందికి ఈ విండ్యలో బీపీవో ఉద్యోగాలు పొందారు. అలాగే నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో నైపుణ్యాభివృద్ధికి ఐదుగురు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ జే.మాధవి, సూపరింటెండెంట్ పద్మావతి, ఇతర సిబ్బంది అప్పలనాయుడు, గోవింద్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మెడికల్ షాపు, ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఏడీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అనూష

గంగవరం : మండల కేంద్రంలోని పాతవీధిలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్, మెడికల్ షాపు, ల్యాబ్‌ను తహసీల్దార్ శ్రీమన్నారాయణ , రంపచోడవరం ఏడీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అనూష తీట్ల, పీహెచ్‌సీ వైద్యాధికారి భావన సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా వైద్యం చేయడం, మందులు విక్రయిస్తున్నట్టు తమ దృష్టికి రావడంతో తనిఖీ చేసినట్టు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ద్వారా క్లినిక్, ల్యాబ్ నిర్వహణకు సంబంధించిన అన్ని అనుమతులు పొందిన తరువాత నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు.

ఆస్పత్రికి ఎన్నారైల వితరణ

చింతూరు: ఎన్నారైలు సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రికి బెడ్‌షీట్లు, పిల్లో కవర్లు వితరణగా అందజేశారు. ఎన్నారైలు యడ్లపల్లి రామారావు, కైసా కాశీ, గాందె సునిల్‌కుమార్, సూదిరెడ్డి విక్రమ్‌రెడ్డి వంద చొప్పున బెడ్‌షీట్లు, పిల్లో కవర్లను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డికి అందజేశారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలోని నవజాత శిశు కేంద్రం ముస్కాన్ ప్రాజెక్టుకు ఎంపికైన విషయం తెలుసుకున్న ఎన్నారైలు ఆస్పత్రికి అవసరమైన బెడ్ షీట్లు, పిల్లో కవర్లను అందించారు.

వైద్యులకు సత్కారం



ఏరియా ఆస్పత్రి డాక్టర్ సాయికిషోర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతూరు: డాక్టర్స్ డే పురస్కరించుకుని ఐటీడీఏలో చింతూరు ఏరియా ఆస్పత్రి నాలుగు మండలాల పీహెచ్‌సీల వైద్యులను కలెక్టర్ సుమిత్ కుమార్ సత్కరించారు. రోగులకు అంకితభావంతో సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఒకరి మృతి



కీర్తి వెంకటేష్ మృతదేహం

పాయకరావుపేట : సత్యవరం గ్రామానికి చెందిన కీర్తి వెంకటేష్ (62) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు. మృతుడు కీర్తి వెంకటేష్ సోమవారం సాయంత్రం తన తమలపాకు తోట వద్ద వర్షాలకు తెగి పడి వున్న 240 వోల్టులు కలిగిన విద్యుత్‌తీగ కాలికి తగలడంతో షాక్ గురై మరణించాడని తెలిపారు. మృతుని కుమారుడు నానాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు మణికంఠ సాయి కుమార్

పాయకరావుపేట : పట్టణంలోని బృందావనానికి చెందిన కోనేటి మణికంఠ సాయికుమార్ (25) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్ఐ గోవిందు తెలిపారు. మణికంఠ ఇద్దరు చెల్లెళ్ల వివాహానికి రూ.3 లక్షలు అప్పు చేయడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగుల్లో మరో రూ.40 వేలు పోగొట్టుకోవడంతో అప్పుల బాధతో గత నెల 30న గడ్డి మందు తాగాడు. అతనిని తుని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్టు ఏఎస్ఐ తెలిపారు. మృతుడి సోదరి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండగ



వెదురునగరంలో బోనాల నిమజ్జనంలో భక్తులు

వై.రామవరం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని, మండల సరిహద్దు ప్రాంతమైన వెదురు నగరం గ్రామ శ్రీసాయిరామ్ గురుస్వామి ఆశ్రమంలో సోమవారం మహంకాళీ అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళీకామాతకు మహిళలు బోనాలతో ఊరేగించి, దేవరమడుగులు, పెద్దేరువాగులో నిమజ్జనం చేశారు. ఆశ్రమ ప్రాంగణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేటమామిడి గ్రామ రేణుకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు రాజారెడ్డి, తదితర వేదపండితులు పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



యల్లవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న చామగడ్డ గ్రామ వలంటీర్ రాజేశ్వరి

వై.రామవరం: మండలంలోని చామగడ్డ గ్రామసచివాలయం పరిధిలోని బురదకోట గ్రామానికి చెందిన జర్త కొండలరావు అనే లబ్ధిదారుడు తీవ్ర అనారోగ్యంతో అడ్డతీగల మండలం యల్లవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ప్రభుత్వం పింఛన్ మంజూరైంది. ఈ నేపథ్యంలో సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న యల్లవరం ప్రభుత్వ ఆస్పత్రికి బస్సుపై వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న లబ్ధిదారుడు కొండలరావుకు చామగడ్డ గ్రామ వలంటీర్ ముర్ల రాజేశ్వరి సోమవారం అందజేశారు. దీంతో గ్రామ వలంటీర్ సేవలకు పలువురు అభినందనలు తెలియజేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



గోవిందరెడ్డి (ఫైల్)



సత్తిబాబు మృతదేహం

నక్కపల్లి : జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పాయకరావుపేట మండలం రాజగోపాలపురానికి చెందిన ఉప్పాడ గోవిందరెడ్డి (47) నక్కపల్లిలో ఐరన్ షాపు దగ్గర హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తుని నుంచి నక్కపల్లి వస్తుండగా గొడిచర్ల వద్ద వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పాయకరావుపేట మండలం పాల్తేరుకు చెందిన దుర్గాప్రసాద్, రాజబాబుకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం కాకినాడ తరలించారు. గోవిందరెడ్డి సోదరుడు వరహాల రెడ్డి ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సారిపల్లిపాలెం సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. ఎలమంచిలి దగ్గర శేషకొండ కాలనీకి చెందిన పడాల సత్తిబాబు(24) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సారిపల్లిపాలెం సమీపంలో అకస్మాత్తుగా ఆగిన వ్యాన్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నక్కపల్లికి ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలిస్తుండగా మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సి వెంకటరావు తెలిపారు.